

నాణ్యమైన విత్తనాలతో అధిక దిగుబడులు

- రైతులు ఒకటి కంటే ఎక్కువ పంటలను సాగు చేయాలి
- పాడి పశువులతో ఆర్థిక చేయూత
- రూ.1.30 కోట్లతో హెచ్.కైరవాడి గ్రామంలో ప్రధాన రహదారి
- కలెక్టర్ డాక్టర్ సిరి

ప్రజాశక్తి - గోనెగండ్ల

నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకోవడం ద్వారా రైతులు పంటల్లో అధిక దిగుబడులు సాధించవచ్చని కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి తెలిపారు. బుధవారం మండలంలోని కులుమాల, హెచ్.కైరవాడి, గాజులదిన్నె ప్రాజెక్టు గ్రామాల్లో పర్యటించారు. ముందుగా కులుమాల గ్రామంలో జాతీయ ఆహార నూనె గింజల పథకం 2025-26 కార్యక్రమంలో పాల్గొని రైతులకు వేరు శనగ విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. జాతీయ ఆహార నూనె గింజల పథకం కింద జిల్లాలో రబీలో గోనెగండ్ల, ఎమ్మిగనూరు, వెల్దుర్తి, పత్తికొండ, మద్దికెర మండలాల్లో 500 హెక్టార్లకు రూ.85.50 లక్షల విలువ గల 750 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలను ఉచితంగా ఇస్తున్నామని తెలిపారు. రైతుకు హెక్టార్ చొప్పున సరిపడా విత్తనాన్ని ఇస్తున్నామన్నారు. ప్రస్తుతం రైతులకు పంపిణీ చేసే వేరుశనగ టిసిజిఎస్ 1694 విత్తనం చాలా మంచి రకం విత్తనమని తెలిపారు. గోనెగండ్ల మండలంలో 100 హెక్టార్లకు రూ.17.10 లక్షల విలువ గల 150 క్వింటాళ్ల వేరుశనగను ఉచితంగా ఇస్తున్నామని చెప్పారు. విత్తనాలను నల్లారెడ్డి స్వామి రైతు ఉత్పత్తి దారుల కంపెనీ లిమిటెడ్ (ఎఫ్‌పిఒ) ద్వారా అందిస్తున్నామని తెలిపారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ పథకం కింద బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం టెక్నికల్ సపోర్టింగ్ ఏజెన్సీగా వ్యవహరించి రైతులకు విత్తనం వేసినప్పటి నుంచి పంట విక్రయించే వరకు సలహాలు, సూచనలు అందిస్తుందని తెలిపారు. రైతులు ఒకటే పంట వేసి, దాని మీద ఆధార పడకుండా 2, 3 రకాల పంటలు వేయాలని, తద్వారా ప్రయోజనాలు పొందవచ్చని చెప్పారు. పాడి పశు వులను కూడా పెంచుకుంటే లాభం చేకూరుతుందన్నారు. పాడి పశు వులను పెంచుకునేందుకు పశు సంవర్ధక శాఖ వారితో రుణాలిప్పించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆయిల్ పామ్‌ను ప్రోత్సహించడంలో భాగంగా రూ.30 వేల విలువ గల 150 మొక్కలను ఉచితంగా అందజేస్తున్నారని, వాటిని నాటుకొని ఆయిల్ పామ్ పంట సాగు చేసుకుంటే మంచి దిగుబడి వస్తుందని తెలిపారు. నల్లారెడ్డి స్వామి రైతు ఉత్పత్తి దారుల కంపెనీ లిమిటెడ్ రూ.8 కోట్ల టర్నోవర్‌తో నిర్వహించడం అభినందనీయమని చెప్పారు. కలెక్షన్ సెంటర్, కోల్డ్ స్టోరేజ్ యూనిట్, సోలార్ డెవలపింగ్ ప్రాసెసింగ్ యూనిట్లకు భూమి కావాలని రైతు ఉత్పత్తి దారుల సంఘం కోరారని, అధికారులతో మాట్లాడి చర్యలు చేపడతామని తెలిపారు. కైరవాడి గ్రామంలో పెద్దనేలటూరుకు వెళ్లే అంతర్గత ప్రధాన ఆర్‌అండ్‌బి రహదారి వర్షపు నీటితో నిండి కుంటలా మారిందని, సిసి రోడ్డు, డ్రెయినేజీల నిర్మాణాలకు తగిన చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కలెక్టర్‌ను కోరారు. స్పందించిన కలెక్టర్ రూ.1.30 కోట్లతో కెరవాడి బస్టాండ్ నుంచి పెద్దనేలటూరు రోడ్డు వరకు గ్రామంలోని ఆర్‌అండ్‌బి ప్రధాన రహదారిని సిసి రోడ్డు వేసి డ్రైనేజీలు నిర్మించేందుకు చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆదోని ఇన్‌ఛార్జ్ సబ్ కలెక్టర్ అజయ్, జెడిఎ వరలక్ష్మి, పశు సంవర్ధక శాఖాధికారి శ్రీనివాస్, తహశీల్దార్ రాజేశ్వరి, ఎంపిడిఒ మణిమంజరి, సర్పంచ్ బుడ్డన్న, ఎమ్మిగనూరు మార్కెట్ యార్డు చైర్మన్ మల్లయ్య, ఎడిఎ మహ్మద్ ఖాద్రీ, ఎఒ హేమలత, కెవికె కోఆర్డినేటర్ రాఘవేంద్ర, టిడిపి మండల కన్వీనర్ తిరుపతయ్య నాయుడు, నాయకులు చాంద్ బాషా, కురువ రాముడు, నల్లారెడ్డి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



వేరుశనగ విత్తనాలు పంపిణీ చేస్తున్న కలెక్టర్ సిరి, అధికారులు, నాయకులు

గాజులదిన్నె ప్రాజెక్టు పరిశీలన

మండలంలోని గాజులదిన్నె ప్రాజెక్టును కలెక్టర్ సిరి పరిశీలించారు. ముందుగా ప్రాజెక్టు వద్ద సాగునీటి సరఫరా పరిస్థితులు, జలాశయం నీటి నిల్వ స్థాయి, సాగు కాల్వల నిర్వహణ పనులు, మరమ్మతుల గురించి ఇరిగేషన్ ఎస్ఇని అడిగి తెలుసుకున్నారు. 4.5 టిఎంసీల సామర్థ్యం ఉన్న వాటిని 5.5 టిఎంసీ సామర్థ్యం పెంచేందుకు బండ్ ఎత్తు, విస్తీర్ణం పెంచుకుంటూ వెళ్లాలని, అందుకు సంబంధించిన నిధుల విడుదల కాక ఇంకా కొన్ని పనులు ఆగిపోయాయని ఇరిగేషన్ ఎస్ఇ కలెక్టర్ వివరించారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. ఇరిగేషన్ ఎస్ఇ బాలచంద్ర రెడ్డి, హెచ్ఎన్ఎస్ఎస్ ఎస్ఇ పాండురంగయ్య, ఆర్‌డిఒ రామయ్య, ప్రాజెక్టు డిఇ సుబ్బారాయుడు, ఎఇ చిన్న అలీ, సిబ్బంది ఉగ్ర నరసింహ పాల్గొన్నారు.



ప్రాజెక్టు అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

అబూబకర్ మృతి..

ఆవాజ్ ఉద్యమానికి తీరని లోటు

మాజీ ఎమ్మెల్యే ఎంఏ.గఫూర్, ఎస్ఎ.సుభాన్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ఆవాజ్ రాష్ట్ర కమిటీ ఉపాధ్యక్షులు అబూబకర్ అకాల మరణం ఆవాజ్ ఉద్యమానికి తీరనిలోటని ఆవాజ్ కమిటీ రాష్ట్ర ఫౌండర్, మాజీ ఎమ్మెల్యే ఎంఎ.గఫూర్, రాష్ట్ర అధ్యక్షులు ఎస్ఎ.సుభాన్, ఆవాజ్ రాష్ట్ర కమిటీ సభ్యులు, పి. ఇక్బాల్ హుస్సేన్, ఎస్ఎండి. షరీఫ్ లు తమ ప్రగాఢ సానుభూతిని, సంతాపాన్ని ప్రకటించారు. అబూబక్కర్ మరణ వార్త తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని తెలిపారు. వారు నందికొట్కూరులోని ఆయన నివాసిని వెళ్లి భౌతిక కాయాన్ని సందర్శించారు. ముస్లిం, ఇతర సమాజానికి ఆయన సేవలు ఎనలేనివివన్నారు. ఆయన లౌకిక వాదానికి లౌకిక తత్వానికి కట్టుబడి పోరాటాలు చేసేవారని అన్నారు. ఆయన మరణం ముస్లిం సమాజానికి తీరని లోటు అని తెలిపారు. ముస్లిం మైనార్టీల హక్కులతో పాటు ఇతర సామాజిక అభ్యున్నతి కోసం అనగారిన ప్రజల కోసం అన్ని రకాల సమస్యల పరిష్కారం కోసం రాజీలేని పోరాటం చేసిన కషీవలుడు అన్నారు. జీవితాన్ని ప్రజాసేవ కోసం అంకితం చేసిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. ఆయన ఆశయసాధన కోసం ఆవాజ్ ఎల్లవేళలా ముందుంటుందని అన్నారు. వారి కుటుంబ సభ్యులు మనోధైర్యం తో ఉండాలని అన్నారు. సంతాపం



నివాళులర్పిస్తున్న గఫూర్



నివాళులర్పిస్తున్న షరీఫ్, నాయకులు

రాష్ట్రంలో అగ్రగామిగా నిలుపుదాం

- సిఎం దృష్టికి ఎబిసి క్యాంపుల్లో హైకోర్టు బెంచ్ ఏర్పాటు అంశం
- స్మార్ట్ సిటీ పనులకు సైతం వినియోగం
- నగరపాలక అధికారుల సమీక్షలో మంత్రి టిజి.భరత్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసి రాష్ట్రంలో అగ్రగామిగా నిలుపుదామని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టిజి.భరత్ అన్నారు. బుధవారం నగరపాలక సంస్థ సమావేశ భవనంలో కమిషనర్ పి.విశ్వనాథ్‌తో కలిసి అన్ని విభాగాల అధికారులు, అమినిటీస్ కార్యదర్శులు, కాంట్రాక్టర్లతో సమావేశం నిర్వహించారు. ముందుగా నగరంలో రూ.12.62 కోట్లతో జరుగుతున్న 62 అభివృద్ధి పనులపై కాంట్రాక్టర్ల వారీగా సమీక్ష నిర్వహించారు. జాప్యం జరుగుతున్న పనులపై మంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆలస్యం చేసే కాంట్రాక్టర్లపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మంత్రి భరత్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కర్నూలుపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ, ప్రగతిలో ముఖ్య స్థానాన్ని ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకుందని పేర్కొన్నారు. కర్నూలులో హైకోర్టు బెంచ్ మంజూరు కావడం హర్షణీయమని చెప్పారు. దీన్ని నగర శివార్లలో కాకుండా ఎబిసి క్యాంపుల్లో ఏర్పాటు చేసే అంశంపై ఇటీవల విదేశీ పర్యటనలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో చర్చించినట్లు వెల్లడించారు. ముఖ్యమంత్రి సైతం దీనిపై సానుకూలంగా ఉన్నారని తెలిపారు. వాటిలోనే స్మార్ట్ సిటీ ప్రాజెక్ట్ పనుల కోసం అవసరమైన నిర్మాణాలు చేయనున్నట్లు వివరించారు. బుధవారపేట మెడికల్ కాలేజీ మలుపు వద్ద ఉన్న షాపుల తొలగింపుపై న్యాయస్థానం ఇచ్చిన తీర్పును అమలు చేసేందుకు చర్యలు ప్రారంభించినట్లు తెలిపారు. తరువాత రహదారుల విస్తరణ, పారిశుధ్య, టిడ్కో, గృహాలు, గత సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాల అమలు పురోగతి తదితర అంశాలపై నగరపాలక అధికారులతో సమీక్ష నిర్వహించారు. సమావేశంలో అదనపు కమిషనర్ ఆర్‌జివి.కృష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, మేనేజర్ చిన్నరాముడు, ఇన్‌చార్జ్ ఎస్ఇ శేషసాయి, ఆర్ఒలు జునైద్, స్వర్ణలత, వాజిద్, పారిశుధ్య పర్యవేక్షక అధికారి నాగరాజు, ఎంఇ మనోహర్ రెడ్డి, పట్టణ ప్రణాళిక అధికారి అంజాద్ బాష తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి టిజి.భరత్

అవినీతికి పాల్పడొద్దు

- డిఆర్ఒ వెంకటనారాయణమ్మ

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ప్రభుత్వ ఉద్యోగులు అత్యాశకు పోయి అవినీతికి పాల్పడరాదని జిల్లా రెవెన్యూ అధికారి వెంకటనారాయణమ్మ పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో విజిలెన్స్ అవేర్నెస్ వీక్ -2025 కార్యక్రమం నిర్వహించారు. డిఆర్ఒ మాట్లాడుతూ.. అవినీతి నివారణ పై ప్రజలకు , ఉద్యోగస్తులకు అవగాహన కార్యక్రమం అక్టోబర్ 29 నుండి నవంబర్ 2 వరకు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎంతో కష్టపడి చదివి లక్షల మందితో పోటీపడి పరీక్షలు రాసి సాధించిన ఉద్యోగాన్ని ప్రజల అభివృద్ధి కోసం చేయాలన్నారు. ప్రజలు కట్టే పన్నుల నుండి మనకు ప్రతినెల జీతాలు వస్తున్నాయని ,అది గుర్తుపెట్టుకుని ప్రజలకు సేవ చేయాలన్నారు. ఉద్యోగ ధర్మాన్ని నిర్వర్తించాలని కోరారు. అవినీతి నిరోధక శాఖ డిఎస్‌పి సోమన్న మాట్లాడుతూ...అవినీతి నిరోధక అవగాహన కార్యక్రమం ఒక వారం రోజులు పాటు నిర్వహిస్తామని తెలిపారు.ఉద్యోగస్తులు నిజాయితీతో ఉద్యోగ ధర్మాన్ని పాటించి ప్రజలకు సేవ చేయాలని కోరారు. కలెక్టరేట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ శివరాముడు, అవినీతి నిరోధక శాఖ ఇన్‌స్పెక్టర్లు కృష్ణ, రాజా, ప్రభాకర్, ఉద్యోగస్తులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డిఒ వెంకట నారాయణమ్మ

మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణ ఆపాలి

- ఎస్‌ఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసన్నకుమార్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ప్రభుత్వ వైద్య విద్య చదవాలనుకునే విద్యార్థుల ఆశలను కూటమి ప్రభుత్వం ఛిద్రంచేస్తుందని, మెడికల్ కాలేజీల ప్రయివేటీకర, సెల్ఫ్‌ఫైనాన్స్ విధానాన్ని రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసన్నకుమార్ విమర్శించారు. బుధవారం కర్నూలు సుందరయ్య భవన్‌లో ముఖ్య నాయకులు సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదోని ప్రభుత్వ మెడికల్ కళాశాలకు ప్రయివేటీకరణ చేయడం దుర్మార్గమని అన్నారు. ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా భవిష్యత్తులో అందరూ కలిసికట్టుగా పోరాటం చేస్తామని తెలిపారు. ప్రభుత్వం గ్రామీణులకు మెరుగైన వైద్య సేవలను అందించాలన్న ఉద్దేశంతో ఆదోని ప్రభుత్వ వైద్య కళాశాలలను ఏర్పాటు చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కళాశాల పనులను నిలిపివేసి పిపిపి పద్ధతిలో కొనసాగించడానికి క్యాబినెట్ తీర్మానం చేయడం అన్యాయమన్నారు. ప్రయివేటీ కరణతో పేదలకు వైద్యం అందే పరిస్థితి ఉండదని ప్రభుత్వమే వైద్య కళాశాలను నడపాలని డిమాండ్ చేశారు. పిపిపి విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వంలో తెచ్చిన సెల్ఫ్‌ఫై పద్ధతిపైన తాము అధికారంలోకి వస్తే వంద రోజుల్లో రద్దు చేస్తామని ప్రకటించారన్నారు. ఇచ్చిన హామీపైన ఎందుకు నోరు మెదపడం లేదని వాపోయారు. అధికారంలోకి రాకముందు ఒక మాట, అధికారంలోకి వచ్చాక మరోరా మాట్లాడటం కూటమి ప్రభుత్వానికే చెల్లిందన్నారు. వెంటనే కూటమి ప్రభుత్వం వైద్య విద్య ప్రయివేటీకరణ ఆలోచనలను వెనక్కి తీసుకోవాలన్నారు. ఎన్ఎంసికి రాసిన లేఖను వెనక్కి తీసుకోవాలని, సెల్ఫ్‌ఫైనాన్స్ విధానాన్ని రుద్ద చేస్తామని ఇచ్చిన హామీని అమలు పరచాలని కోరారు. మెడికల్ కళాశాల భవనాల నిర్మాణాలను వెంటనే పూర్తి చేసి, ఉచిత వైద్య విద్యను అందించాలని డిమాండ్ చేసారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన బాట పడతామని హెచ్చరించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సాయిఉదయ్ , ప్రధాన కార్యదర్శి రంగప్ప, ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, అంజి, అబూబకర్, జిల్లా నాయకులు రాము, ఆర్యన్ , కాజా తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఆర్ఎస్ఐ కల్పనకు ఎస్‌పి అభినందన

ఆల్ ఇండియా పోలీసు జూడో క్లస్టర్ గేమ్స్‌లో ప్రతిభ

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

జాతీయ పోలీసు జూడో క్లస్టర్ ఆటల పోటీల్లో వెండి, కాంస్య పథకాలు సాధించిన కర్నూలు ఆర్మ్‌డు రిజర్వుడు ఆర్ఎస్ఐ పి. కల్పనను బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్‌పి విక్రాంత్ పాటిల్ అభినందించారు. ఈనెల 8 నుంచి 16 వరకు జమ్మూ అండ్ కాశ్మీర్ రాష్ట్రంలో జరిగిన 10వ జాతీయ పోలీసు జూడో క్లస్టర్ ఆటల పోటీల్లో ఆంధ్రప్రదేశ్ తరపున కర్నూలు జిల్లా పోలీసుశాఖ నుండి ఆర్ఎస్ఐ కల్పన పాల్గొన్నారు. పెన్కాక్ సిలాట్‌లో ఒక వెండి పతకం , కరాటేలో కాంస్య పతకం ఆమె సాధించారు. భవిష్యత్తులో మరిన్ని పథకాలు సాధించాలని, జిల్లా పోలీసుశాఖకు మంచి పేరు తీసుకురావాలని ఎస్‌పి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ జావేద్ ఉన్నారు.



పంటలపై మొంథా తుఫాన్ ప్రభావం

ప్రజాశక్తి-సి బెళగల్

మొంథా తుఫాన్‌తో అకాల వర్షాల వలన పంటలపై తీవ్ర ప్రభావం పడిందని అందుకు మెలకువలు పాటించాలని ఎఒ మల్లేష్ కుమార్ సూచించారు. బుధవారం ఆయా పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. పొలాల్లో వర్షపు నీటిని ఎప్పటికప్పుడు తొలగించుకొని తగు స్థాయిలో సలహాల మేరకు మందులు పిచికారీ చేయాలన్నారు. పత్తి తీత పనులు, ఉల్లి కోత వంటివి వద్దని తెలిపారు. రబి సాగుకు విత్తన శుద్ధి తప్పనిసరిగా చేయించుకోవాలని రైతులకు వివరించారు.



ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును అందజేసిన ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి

సిఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ

ప్రజాశక్తి- కర్నూలు క్రైమ్

కోడుమూరు ఎమ్మెల్యే బొగుల దస్తగిరి బుధవారం తన స్వగృహంలో బాధితుని కుటుంబానికి రూ.49,578 చెక్కును పంపిణీ చేశారు. కోడుమూరు నియోజకవర్గం సి.బెలగల్ మండలం కంపాడు (కంబదహాల్) గ్రామానికి చెందిన డి.నాగన్న అనారోగ్య కారణాలవల్ల హాస్పిటల్ లో చికిత్స పొందుతూ మరణించారు. అనంతరం ఆర్థిక పరిస్థితులు బాగా లేనందున వారు సహాయం కోసం కోడుమూరు ఎమ్మెల్యేను సంప్రదించగా సీఎంఆర్ఎఫ్ పథకం కింద దరఖాస్తు చేసుకున్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లి మంజూరు వారికి రూ.49,578 చేయించారు. చెక్కును తీసుకున్న లబ్ధిదారులు ముఖ్యమంత్రికి, డి.విష్ణువర్ధన్‌రెడ్డికి, ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరికి కృతజ్ఞతలు తెలిపారు.

విశ్రాంత మత్స్యశాఖ ఉద్యోగి ఆగడాలను అరికట్టండి

-మీడియాలో బాధిత రైతుల ఆవేదన

ప్రజాశక్తి-సి బెళగల్

మత్స్యశాఖలో పని చేసి పదవి విరమణ పొందిన ఉద్యోగి బారికి శ్రీనివాసులు ఆగడాలు అరికట్టాలని ఆయన బాధిత రైతులు వరలక్ష్మి, సుమిత్రమ్మలు బుధవారం మీడియాలో ఆవేదన వ్యక్తం చేస్తూ విలపించారు. ఆ ఉద్యోగి తన 20 నుండి 25 ఎకరాలలో ఎక్కడ పడితే అక్కడ గుంతలు త్రవ్వి మట్టిని అమ్ముకోవడమే కాకుండా మా పొలాలకు ఆనుకొని కుంటలు త్రవ్వడం కాల్వలు ఏర్పాటు చేసుకోవడం ఇబ్బందులకు గురి చేస్తున్నారని వాపోయారు. పొలం గట్ల మీద అక్రమంగా విద్యుత్ స్తంబాలు, ట్రాన్స్‌ఫార్మర్లు పెట్టుకొని దౌర్జన్యం చేస్తున్నారన్నారు. మా పొలాల్లో వెళ్తున్న ఎల్లెల్సి కాల్వలకు గండ్లు పొడిచి కుంటలను నింపుకొని నిండిన తర్వాత మాపొలాల మీదకు వదులుతున్నారని, ఏటా పంటలు నాశనం అవుతున్నాయని తెలిపారు. ఈ ఏడాది కూడా మూడు ఎకరాలలో వేసిన కంది పంట చేతికొచ్చే వేళ నీళ్లు అధికంగా నిలిచి నాశనం అయ్యిందని, రైతు సుమిత్రమ్మ ఎకరంలో గోరు చిక్కుడు చేతికంది వచ్చి పోయిందని, రైతు వరలక్ష్మి ఇలా ఏటా నష్టాలను చవి చూస్తున్నామని మా నష్టాలు కష్టాలు ఎవరికీ పట్టడం లేదని వాపోయారు. ఆ ఉద్యోగి కూడా భూ బకాసురుడు సలీమ్ శంకర్ బాటలోనే ఆక్రమించుకున్న భూములేనని ఆగడాలపై నిలదీసినప్పుడల్లా బెదిరింపులు, వేధింపులకు పాల్పడుతున్నారని ఫిర్యాదులు చేసినా నామ మాత్రపు చర్యలు తప్ప పట్టించుకున్న వారు లేరన్నారు.

ఇప్పటికైనా జిల్లా అధికారులు, మండల అధి కారులు మాకు జరుగుతున్న అన్యాయంపైనా , మత్స్య శాఖ ఉద్యోగి ఆగడాలపైనా గట్టి చర్యలు చేపట్టి ఆదుకోవాలని బాధిత రైతులు మీడియాలో మొరపెట్టుకున్నారు.



రైతు వరలక్ష్మి



రైతు సుమిత్రమ్మ

పంటలకు తీసుకోవలసిన జాగ్రత్తలు

ప్రజాశక్తి-కోడుమూరు

మండల పరిధిలోని ప్యాలకుర్తి గ్రామంలో మొంథా తుఫానుతో కురిసిన వర్షాలకు పంటలను కాపాడుకోవడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను మండల వ్యవసాయ అధికారి రవిప్రకాష్ వివరించారు. బుధవారం జిల్లా శిక్షణ కేంద్రం నుంచి ఎడిఎ ఎస్. వెంకటేశ్వర్లు, ఎఒ వెంకట రంగారెడ్డి హాజరయ్యారు. వారు మాట్లాడుతూ మిశ్రమ పంటల సాగు విధానం ద్వారా ఇలాంటి తుఫానుల నుండి రైతులు నష్టపోకుండా ఉంటారన్నారు. కందిలో మల్టీకేను స్ప్రే ఎకరాకు కిలో చొప్పున చేసుకుంటే పూతరాలుటను అరికట్ట వచ్చున్నారు. కందిలో గూడు పురుగు నివారణ కోసం డెల్టామేత్రిన్ ఎకరాకు 100 ఎమ్మెల్ స్ప్రే చేయాలన్నారు. పప్పు శనగలో తేమశాతం పెరిగి ఎండు తెగులు సోకుతుందని దీని నివారణకు బ్లీటాక్స్ స్ప్రే చేయాలని సూచించారు. నీటి ఆధారంగా సాగుచేసిన వేరుశనగలు పచ్చపురుగు, లద్ద పురుగు నివారించుటకు నువేలురాన్, ఇండికేటర్బ్ మందులను కలిపి స్ప్రే చేయాలని, జిప్సం ఎకరాకు 200 కేజీలు వాడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సేవాకేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

మెడికవర్‌లో ప్రపంచ స్ట్రోక్ దినోత్సవంపై అవగాహన

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

ప్రపంచ స్ట్రోక్ దినోత్సవం సందర్భంగా మెడికోవర్ హాస్పిటల్స్, కర్నూలులో స్ట్రోక్ అవగాహన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. బుధవారం న్యూరో , ఎమర్జెన్సీ విభాగ వైద్య నిపుణులు స్ట్రోక్ గురించి ప్రజల్లో అవగాహన కల్పించారు. మెడివర్ కన్సల్టెంట్ న్యూరో సర్జన్ డాక్టర్ కెఎస్‌విశ్వ కుమార్ మాట్లాడుతూ 'స్ట్రోక్ అనేది మెదడుకు రక్తప్రసరణ ఆగిపోయినప్పుడు లేదా రక్తస్రావం జరిగినప్పుడు సంభవించే అత్యవసర పరిస్థితి అని తెలిపారు. ఈ పరిస్థితిని తక్షణం గుర్తించి సరైన చికిత్స అందిస్తే ప్రాణరక్షణ మాత్రమే కాకుండా పాక్షిక పునరుద్ధరణ కూడా సాధ్యమవుతుందన్నారు. ప్రజలు స్ట్రోక్ లక్షణాలను గుర్తించడంలో చురుకుగా ఉండాలని తెలిపారు. కన్సల్టెంట్ న్యూరాలజిస్టు డాక్టర్ వై. రఘు నందిని మాట్లాడుతూ స్ట్రోక్‌కు ప్రధాన కారణాలు అధిక రక్తపోటు, మధుమేహం, కొలెస్ట్రాల్, ధూమపానం, ఒత్తిడి ఈ కారణాలను నియంత్రించడం ద్వారా స్ట్రోక్ ముప్పును తగ్గించవచ్చన్నారు. ముఖం వంగడం, చేతి లేదా కాలి బలహీనత, మాటల అడ్డంకి వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే ఆసుపత్రికి రావడం అత్యంత ముఖ్యమని చెప్పారు. ఎమర్జెన్సీ మెడిసిన్ స్పెషలిస్టు డాక్టర్ టివి. సునీల్ యాదవ్ మాట్లాడుతూ స్ట్రోక్ వచ్చిన తరువాత మొదటి గంట 'గోల్డెన్ అవర్' గా పిలుస్తారు. ఈ సమయంలో సరైన చికిత్స అందితే రోగి ప్రాణాలు కాపాడటమే కాకుండా మెదడు దెబ్బతినకుండా చేయవచ్చన్నారు. ప్రతి ఒక్కరూ ఈ విషయాన్ని గుర్తుంచుకుని వెంటనే వైద్య సహాయం పొందాలిలన్నారు. స్ట్రోక్ నుండి కోలుకున్న రోగులు తమ అనుభవాలను పంచుకున్నారు. వారు తక్షణ వైద్య సహాయం , మెడికోవర్ వైద్య బృందం అందించిన సేవలను గుర్తుచేసుకున్నారు. స్ట్రోక్ పేషెంట్లను సమయానికి ఆసుపత్రికి చేర్చిన అంబులెన్స్ డ్రైవర్లకు కృతజ్ఞత సూచక బహుమతులు అందజేశారు. క్లస్టర్ హెడ్ మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ స్ట్రోక్ పై సమాజంలో అవగాహన పెంచడం అత్యంత అవసరమన్నారు. స్ట్రోక్ వచ్చినప్పుడు ఒక్క నిమిషం ఆలస్యం కూడా ప్రాణహానికి దారితీస్తుందన్నారు. అందుకే ప్రతి ఒక్కరూ స్ట్రోక్ లక్షణాలను తెలుసుకుని, వెంటనే వైద్య సహాయం పొందాలన్నారు. మెడికోవర్ హాస్పిటల్స్, కర్నూల్‌లో 24 గంటలూ న్యూరో ఎమర్జెన్సీ సదుపాయాలు అందుబాటులో ఉన్నామని తెలిపారు.



ప్రపంచ స్ట్రోక్ దినోత్సవంలో పాల్గొన్న వైద్యులు, సిబ్బంది, రోగులు



మాట్లాడుతున్న సిఇఒ డాక్టర్ వేణుగోపాల్

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్ : విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సెట్కూరు సిఇఒ డాక్టర్ కె. వేణుగోపాల్ అన్నారు. బుధవారం కర్నూలు నగరంలోని స్థానిక బిక్యాంప్ జూనియర్ కళాశాలలో సెట్కూరు ఆధ్వర్యంలో మత్తుపదార్థాలు వ్యసనం -పర్యవసానాలు, సైబర్ క్రైమ్ అనే అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. సెట్కూరు సిఇఒ డాక్టర్ కె.వేణుగోపాల్ మాట్లాడుతూ మత్తు పదార్థాలకు అలవాటు పడితే విలువైన జీవితం కోల్పోవాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ సరళాదేవి, సెట్కూరు పర్యవేక్షకులు శ్యాంబాబు, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలి


ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్ : రాయలసీమలో నెలకొన్న కరువు నివారణకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని ప్రజా పరిరక్షణ సమితి అధ్యక్షులు కె.బలరాం డిమాండ్ చేశారు. బుధవారం కర్నూలు నగరంలోని ప్రజాపరక్షణ సమితి కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాయలసీమ ప్రాంతం తీవ్ర కరువు కాటకాలకు ఎదుర్కొంటుందన్నారు. ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయడంలో పాలకులు కూడా వైఫల్యం చెందారన్నారు. ఈ సమావేశంలో ప్రజా పరిరక్షణ సమితి నేతలు పద్మానందయోగి, డేవిడ్, రవికుమార్, మురళి, శేషపాణి, శివ, పురుషోత్తం, చంద్ర, శ్రీరాములు, సేసికుమార్ తదితరులు పాల్గొన్నారు.



పర్వేజ్ కుటుంబాన్ని మరామర్శిస్తున్న ఎంఏ.హఫీజ్‌ఖాన్, బైరెడ్డి సిద్ధార్థరెడ్డి

పర్వేజ్ కుటుంబాన్ని పరామర్శించిన హఫీజ్ ఖాన్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్: కర్నూలు నియోజకవర్గం వైసిపి నాయకులు పర్వేజ్ ఖాన్ తండ్రి ఇటీవల మరణించిన నేపథ్యంలో వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్, వైసిపి యూత్ వింగ్ వర్కింగ్ ప్రెసిడెంట్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి, నందికొట్కూరు సమన్వయకర్త డాక్టర్ దారా సుధీర్ తో కలసి పరామర్శించారు.


ఎమ్మెల్యే విరుపాక్షిని మర్యాదపూర్వకంగా కలిసిన సునీత

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

- ఎమ్మెల్యే విరుపాక్షి

ప్రజాశక్తి - చిప్పగిరి

గత మూడు రోజుల నుంచి మొంథా తుపాన్ ప్రభావంతో కురిసిన వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఎమ్మెల్యే బి.విరుపాక్షి డిమాండ్ చేశారు. బుధవారం చిప్పగిరిలోని క్యాంపు కార్యాలయంలో ఆయన మాట్లాడారు. గత 20 రోజుల క్రితం రైతులు పప్పు శనగ విత్తనం వేశారని, మొంథా తుపాను వల్ల అధిక వర్షంతో వర్షపు నీరు పొలాల్లోనే ఉండిపోవడంతో పైరంతా కుళ్లిపోయిందని తెలిపారు. నష్టపోయిన రైతులందరికీ విత్తుకోవడానికి విత్తనాలు, పెట్టుబడులకు ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు. సంబంధిత వ్యవసాయ శాఖాధికారులు స్పందించి నష్టపోయిన రైతుల వివరాలు ఉన్నతాధికారులకు ఇచ్చి ఆదుకోవాలని కోరారు.

ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసిన మార్కెట్ యార్డు చైర్పర్సన్ సునీత

చిప్పగిరిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి ఆలూరు మార్కెట్ యార్డు చైర్మన్ కె.సునీత చేరుకొని ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందజేశారు. త్వరలో జరిగే ఆలూరు మార్కెట్ యార్డు చైర్మన్, డైరెక్టర్ల ప్రమాణ స్వీకారానికి రావాలని ఆహ్వాన పత్రికను అందజేశారు.

'మొంథా'తో వరికి నష్టం

- పరిశీలించిన శాస్త్రవేత్తలు

ప్రజాశక్తి - కోసిగి


కోసిగి : పంటలను పరిశీలిస్తున్న అధికారులు

మొంథా తుపాను ప్రభావంతో మండలంలోని వరి పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. బుధవారం ఎఒ ఎం.వరప్రసాద్ ఆధ్వర్యంలో కర్నూలు ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ పి.సుజాత, డాక్టర్ వైఎస్.సతీష్ కుమార్, ఆదోని సహాయ వ్యవసాయ సంచాలకులు బి.బాలవర్ధిరాజు, వ్యవసాయ సిబ్బందితో కూడిన బృందం మండలంలోని సాతనూరు, తుమ్మిగనూరు గ్రామాల్లో నష్టపోయిన పంటలను పరిశీలించారు. వారు మాట్లాడుతూ... రెండు, మూడు రోజుల నుంచి కురిసిన వర్షానికి వరి పంట నేలకొరిగిందని, రైతులు పరిమళ్లో నీరు నిల్వకుండా కాలువల ద్వారా బయటికి వెళ్లే మార్గం చేసుకోవాలని తెలిపారు. ఎక్కడైనా పంట నష్టం వాటిల్లితే సంబంధిత రైతు సేవా కేంద్రం సిబ్బందిని సంప్రదించాలని చెప్పారు. తుమ్మిగనూరు సర్పంచి వి.ఈరన్న, గ్రామ పెద్దలు వి.గోపాల్, రంగస్వామి, హనుమేష్, వ్యవసాయ సిబ్బంది మధు, హనుమంతు నాయక్, వివిఆర్ఒ. అలీఫ్ పాల్గొన్నారు. మంత్రాలయం మండలంలో దెబ్బతిన్న పంటలను ఎఒ జీరా గణేష్, ఏరువాక కేంద్ర శాస్త్రవేత్తలు సుజాతమ్మ, సతీష్‌లతో కలిసి పరిశీలించారు. మండలంలోని నాగలాపురం, కాచాపురం, రాంపురం గ్రామాల్లోని పత్తి, వరి పంటల దిగుబడులపై ఆరా తీశారు.

కరణిలో విష జ్వరాలు..

- వైద్య శిబిరం ఏర్పాటు..!

ప్రజాశక్తి - కౌతాళం


దోమల నివారణకు పిచికారి చేయిస్తున్న అధికారులు

మండలంలోని కరణి గ్రామంలో విష జ్వరాలు విజృంభించాయి. గ్రామంలో ప్రజలు జ్వరాలతో, నొప్పులతో వైద్యుల వద్దకు పరుగులు తీస్తున్నారు. కొంతమంది ప్రైవేట్ వైద్యుల వద్ద, మరి కొంతమంది కోసిగి ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లి చికిత్స పొందుతున్నారు. గ్రామంలో ప్రజల పరిస్థితిని తెలుసుకున్న సర్పంచి పుష్పలత, గ్రామ నాయకులు గోవింద వైద్యుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు అపరిశుభ్రంగా ఉన్నచోట బ్లీచింగ్ పౌడర్ వేయించి దోమల నివారణ కోసం పిచికారి చేయించారు.

గ్రామంలో వైద్య శిబిరం : కరణి గ్రామంలో చాలామంది అనారోగ్యానికి గురై ఇబ్బందులు పడుతున్న విషయాన్ని తెలుసుకున్న కందుకూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు అభిరుప్ వైద్య సిబ్బందితో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి పరీక్షలు నిర్వహించారు. 35 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా ఇందులో కొంతమందికి జ్వరాలు, మరి కొంతమందికి కాళ్ల నొప్పులు ఉన్నట్లు గుర్తించారు. గ్రామస్తులకు తగిన సూచనలు చేసి, జ్వరాలతో ఉన్న వారు కోసిగి ప్రభుత్వాస్పత్రికి వచ్చి వైద్య పరీక్షలు చేయించుకోవాలని డాక్టర్ అభిరుప్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

పంచాయతీ నిధులు స్వాహా..!

- పనులు చేయకుండానే బిల్లులు

- మార్లమడికి పంచాయతీ కార్యదర్శి నిర్వాకం

ప్రజాశక్తి - హోళగుంద

మార్లమాడికి పంచాయతీ పరిధిలో అభివృద్ధి పనులు చేయకుండానే పంచాయతీ కార్యదర్శి రూ.లక్షలు ఖర్చు చేసినట్లు రికార్డుల్లో చూపించి స్వాహా చేశారని ఎపి దళిత సమాఖ్య మండల అధ్యక్షులు నల్ల మల్లేశప్ప, సిపిఎం మండల కార్యదర్శి వెంకటేష్, రైతుసంఘం నాయకులు రవికుమార్, సిఐటియు మండల కార్యదర్శి నాగరాజు విమర్శించారు. బుధవారం వారు మాట్లాడారు. మార్లమాడికి గ్రామాభివృద్ధికి 15వ ఆర్థిక సంఘం నిధుల దుర్వినియోగంపై విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. గ్రామంలో పనులు చేయకుండా, ఉన్నతాధికారితో మిలాఖత్ అయి దొంగ బిల్లులతో సుమారు రూ.3.50 లక్షలను పంచాయతీ కార్యదర్శి మింగేశారని మండిపడ్డారు. నీటి పంపు మోటార్‌కు మారమ్మతుల పేరిట రూ.91,380, సిబ్బంది జీతాల బిల్లుల పేరిట రూ.50 వేలు, పారిశుధ్యం పనుల కింద రూ.1.18 లక్షలు ఇలా సెప్టెంబర్‌లో, 2025వ సంవత్సరానికి సంబంధించిన పంచాయతీ నిధులు రూ.3.50 లక్షలు జేబులో వేసుకున్నట్లు విమర్శించారు. అలాగే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే నిధులు, ప్రజలు చెల్లించే పన్నులతో పాటు ప్రతి పైసాకు జమా ఖర్చులు పారదర్శకంగా ఉండాలని స్పష్టం చేశారు. ఈ పంచాయతీల్లో ఈ యాప్‌లోను తప్పుడు బిల్లులు అప్‌లోడ్ చేస్తూ నిధులు కాజేస్తున్నారని విమర్శించారు. పంచాయతీ నిధులతో పాటు, ప్రభుత్వం మంజూరు చేసిన నిధులను దొంగ బిల్లులు చేసి, సర్పంచి తనయునితో కలిసి పంచాయతీ కార్యదర్శి బొక్కేస్తున్నారని మండిపడ్డారు. మార్లమడి పంచాయతీకి 15వ ఆర్థిక సంఘం నిధుల కింద ఇటీవల ప్రభుత్వం రూ.10 లక్షలు విడుదల చేసిందని, ఈ నిధులపై పంచాయతీ కార్యదర్శి కన్ను పడిందని తెలిపారు. పనులు చేయకుండా విడతల వారీగా నిధులను పక్కదారి పట్టించారని చెప్పారు. ఉన్నతాధికారులు స్పందించి పంచాయతీ పాలనను గాడిన పెట్టాలని, అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని కోరారు. ఎంపిడిఒ విజయలలితను వివరణ కోరగా... మార్లమడికి పంచాయతీకి సంబంధించిన నిధుల దుర్వినియోగంపై విచారణ చేపట్టి, సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.


మాట్లాడుతున్న కార్మిక సంఘం నాయకులు


మార్లమడికి ఎస్సీ కాలనిలో రోడ్డు పై నిలిచిన మురుగు

పంచాయతీ కార్యదర్శిపై విచారణ చేపట్టాలి



- సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు నారాయణ స్వామి

గ్రామాభివృద్ధి కోసం పాటుపడాల్సిన పంచాయతీ కార్యదర్శి పంచాయతీ నిధులను దుర్వినియోగం చేయడంపై అధికారులు విచారణ చేపట్టాలి. స్పందించకపోతే జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

మట్టి వేసి చేతులు దులుపుకున్నారు

- పెద్ద తిమప్ప, మార్లమాడికి గ్రామస్తుడు



మా ఎస్సీ కాలనీలో రోడ్డు మొత్తం బురదమయంగా మారింది. సిసి రోడ్డు వేయాలని అధికారులకు ఎన్నోసార్లు విన్నవించాం. సిసి రోడ్డు వేయకుండా మట్టి వేయడంతో చిన్నపాటి వర్షానికి రోడ్డు మొత్తం బురదమయంగా మారింది. తిరిగేందుకు ఇబ్బందులు పడుతున్నాం.


మరమ్మతులు చేపడుతున్న సిబ్బంది

పైపులైన్‌కు మరమ్మతులు

- ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి - నందవరం

గ్రామంలో చెడిపోయిన పైపులైన్‌కు అధికారులు బుధవారం మరమ్మతులు చేపట్టారు. ఇటీవల ప్రజాశక్తి ప్రచురితమైన 'ప్రజారోగ్యంపై నిర్లక్ష్యం' కథనానికి అధికారులు స్పందించారు. కోటా వీధిలో వీరభద్ర దేవాలయం దగ్గర గత మూడు నెలలుగా కుళాయి పైపు చెడిపోయి నీరు వృథాగా వెళ్లేవి. కోటావీధిలో నీటి ట్యాంకు సరఫరా చేసే ప్రధాన పైపు చెడిపోయింది. పైపుల ద్వారా నీరు కలుషితమై అనారోగ్యాలకు గురవుతున్నామని, చాలా నీరు వృథాగా వెళ్తున్నాయని ప్రజలు అనేక సందర్భాల్లో అధికారులకు తెలిపినా స్పందించలేదని తెలిపారు. సమస్యను గుర్తించి ప్రజాశక్తి కథనాన్ని ప్రచురించింది. కథనంతో సమస్య పరిష్కారమైందని వీధి ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. పంచాయతీ సెక్రటరీ రామారావు, తోట రంగముని ఉన్నారు.

మద్యం మత్తులో వాహనాలు నడపితే చర్యలు : ఎస్ఐ

ప్రజాశక్తి - మంత్రాలయం

మద్యం మత్తులో వాహనాలు నడపితే చర్యలు తప్పవని ఎస్ఐ శివాంజల్ హెచ్చరించారు. బుధవారం సిఐ రామాంజులు ఆదేశాల మేరకు మండలంలోని చెట్నిహల్లి గ్రామ సమీపంలో డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మద్యం తాగి వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోతున్నారని చెప్పారు. మద్యం తాగి వాహనాలు నడిపితే వారిపై కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.

వంకలపై బ్రిడ్జి నిర్మించాలి : సిపిఎం

ప్రజాశక్తి-ఆలూరు

మండలంలోని మనేకుర్తి గ్రామంలో ప్రజలు, రైతులు సమస్య ఎదుర్కొంటున్న మూడు వంకలపై బ్రిడ్జి నిర్మించాలని సిపిఎం నాయకులు కోరారు. ప్రజా పోరులో భాగంగా బుధవారం గ్రామ రైతులతో కలిసి సచివాలయ అధికారులు యశోద, ఉమామహేశ్వరికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం ఆలూరు ప్రాంతీయ కార్యదర్శి పి.హనుమంతు, సీనియర్ నాయకులు కెపి.నారాయణస్వామి మాట్లాడారు. గ్రామంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, పది రోజులకోసారి తాగునీరు వస్తున్నాయని తెలిపారు. గ్రామంలో డ్రెయినేజీలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, గ్రామంలో చుట్టుపక్కల వంకలు, వాగులు ఉండడంతో వర్షమొస్తే రైతులు పొలాలకు వెళ్లే పరిస్థితి లేదని చెప్పారు. గ్రామం చుట్టూ ఉన్న మూడు వంకలకు కల్వర్టు(బ్రిడ్జి)లు నిర్మించాలని, అధిక వర్షాలకు కూలిపోయిన పశువుల ఆస్పత్రిని నిర్మించాలని డిమాండ్ చేశారు. గ్రామంలో వీధిలైట్లు వేయాలని, నేషనల్ హైవే పక్కన డ్రెయినేజీ కాలువను నిర్మించి.. ఊరి పక్కన ఉన్న వంకలోకి డ్రెయినేజీ నీరు వెళ్లే విధంగా చేయాలని కోరారు. అసంపూర్తిగా ఉన్న సచివాలయ నిర్మాణాన్ని పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. సిపిఎం మండల నాయకులు కృష్ణ, ఈరన్న, పరమేష్ రెడ్డి, గ్రామస్తులు ఆంజనేయ, కె.దేవన్న, దేవరాజు, హనుమేష్, అల్లప్ప, చిన్న కాంత్, నారాయణ, పరమేష్ పాల్గొన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

గోనెసంచుల దుకాణంలో అగ్ని ప్రమాదం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

మార్కెట్ యార్డులోని గోనెసంచుల దుకాణంలో బుధవారం తెల్లవారుజామున అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. విషయం తెలుసుకున్న టిడిపి నాయకులు భాస్కర్ల చంద్రశేఖర్, మార్కెట్ యార్డు ఛైర్మన్ మల్లయ్య ఘటన స్థలానికి చేరుకొని అగ్నిమాపక సిబ్బందికి సమాచార అందించి మంటలు అదుపులోకి తీసుకొచ్చారు. మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి కూడా సంఘటన స్థలానికి చేరుకొని చర్యలు చేపట్టారు.


పరామర్శిస్తున్న చంద్రశేఖర్, మల్లయ్య, గంగిరెడ్డి

రోడ్డు వివాదంలో వ్యక్తి పై దాడి

ప్రజాశక్తి - మంత్రాలయం

మండలంలోని చెట్నిహల్లి గ్రామంలో రోడ్డు ఆక్రమణ విషయంలో ఆక్రమణ దారులు దాడి చేసినట్లు బాధితుడు గంగుల రామాంజినేయులు తెలిపారు. బుధవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఆయన ఫిర్యాదు చేశారు. బాధితుడు మాట్లాడుతూ... 2009లో వడ్ల లక్ష్మయ్యకు చెందిన సర్వే నెంబర్ 119లో గల 1.54 ఎకరాల భూమిని ప్లాట్లు వేసి అమ్మారని తెలిపారు. అందులో తన తండ్రి గంగుల వెంకటేష్ 5 సెంట్లను రూ.22 వేలకు కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ కూడా చేయించుకున్నారని చెప్పారు. ప్లాన్ అప్రూవల్‌లో 14 అడుగుల రస్తాను కూడా చూపించారని తెలిపారు. ఈ రోడ్డుకు వడ్ల లక్ష్మయ్య చిన్న కుమారుడు అక్రమంగా, దౌర్జన్యంగా సురేంద్ర సుతారా అడ్డంగా బండలు పాతారని, ఈ విషయంపై చాలా సార్లు తగాదా కూడా జరిగిందని పేర్కొన్నారు. రోడ్డులో ముళ్లకంప పేరుకొని గడ్డి పెరిగి, ఉండడంతో ఇటీవల పెద్ద పాము ఇంటి ముందుకు వచ్చిందని, దాని వల్ల పిల్లలు భయాందోళన చెందారని తెలిపారు. అపరిశుభ్రంగా ఉన్నందున ట్రాక్టర్ ద్వారా తొలగించాలని ప్రయత్నించగా వడ్ల సురేంద్ర సుతారా, అరుణ్ కుమార్, శివశంకర్, రమాదేవి, పార్వతమ్మ తనపై, తన తల్లిపై దాడి చేశారని చెప్పారు. గాయాలు కావడంతో ఆస్పత్రిలో చికిత్స చేయించుకున్నట్లు తెలిపారు. ఈ విషయంపై పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని, దాడి చేసిన వారిపై కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని కోరారు.




వలసలను నివారించాలి

- వ్యకాస జిల్లా అధ్యక్షులు వీరశేఖర్

ప్రజాశక్తి - దేవనకొండ

కర్నూలు జిల్లా పశ్చిమ ప్రాంతంలో వలసలను నివారించాలని వ్యకాస జిల్లా అధ్యక్షులు బి.వీరశేఖర్ డిమాండ్ చేశారు. బుధవారం దేవనకొండ సచివాలయం దగ్గర వ్యవసాయ కూలీలతో నిరసన చేపట్టారు. వ్యకాస మండల సీనియర్ నాయకులు యూసుఫ్ బాషా అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వీరశేఖర్ మాట్లాడారు. కష్టపడి పని చేసినా ఉపాధి పనికి వేతనాలు ఇవ్వకుండా ప్రభుత్వం కూలీల ఉసురు పోసుకుంటుందని విమర్శించారు. జిల్లా పశ్చిమ ప్రాంతంలో ఏటేటా కొనసాగుతున్న వలసల నివారణలో పాలకుల వైఫల్యం కనబడుతోందని మండిపడ్డారు. వర్షాలు కురిస్తే అతివృష్టి.. లేకపోతే అనావృష్టితో ఈ ప్రాంతం నిత్యం వ్యవసాయ సంక్షోభంలో ఉంటుందని తెలిపారు. వ్యవసాయ పనుల్లేక గ్రామాలకు గ్రామాలు వలస వెళ్తున్నాయని, ఈ నేపథ్యంలో వారి కుటుంబాల్లోని విద్యార్థుల చదువులకు ఆటంకం కలుగుతోందని ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. వలసల నివారణకు ప్రభుత్వం నిర్దిష్టమైన చర్యలు తీసుకోవాలని కోరారు. బ్రహ్మయ్య, నారాయణ, శంకరయ్య, ఎల్లప్ప, రామకృష్ణ, మాదన్న, శ్రీనివాసులు, బాషా పాల్గొన్నారు. **ఆస్పరి**తో పాటు ముత్తుకూరు, కైరుప్పల గ్రామాల్లోని సచివాలయంలో పంచాయతీ కార్యదర్శులకు వినతిపత్రం అందజేశారు. వ్యకాస జిల్లా ఉపాధ్యక్షులు బాలకృష్ణ, రైతుసంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు మధు రెడ్డి, రంగస్వామి, సిఐటియు మండల కార్యదర్శి రామాంజనేయులు, నాయకులు నరసింహులు, రవి, నాగరాజు, పురుషోత్తం, భాస్కర్, రంగన్న, కృష్ణ పాల్గొన్నారు.


దేవనకొండలో వినతిపత్రం అందిస్తున్న నాయకులు




ఆస్పరిలో

బాలోత్సవాన్ని జయప్రదం చేయండి

- జిల్లా కార్యదర్శి ధనుంజయ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఎమ్మిగనూరు బాలోత్సవాన్ని జయప్రదం చేయాలని కర్నూలు బాలోత్సవ జిల్లా కార్యదర్శి డి.ధనుంజయ కోరారు. బుధవారం యుటిఎఫ్ కార్యాలయంలో బాలోత్సవ జయప్రద సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దేశంలో మతోన్మాదం, మనువాదం భావనలు రోజురోజుకు పెరిగిపోతున్నాయని తెలిపారు. చివరికి పాఠ్యాంశాల్లోనూ మార్పులు చేసి చరిత్రను వక్రీకరించి విద్యార్థుల్లో మనువాద భావజాలాన్ని చొప్పించే ప్రయత్నం జరుగుతోందని విమర్శించారు. ఈ నేపథ్యంలో ప్రజాస్వామ్య, లౌకిక, రాజ్యాంగ పరిరక్షణ, అభ్యుదయ భావాలు, శాస్త్రీయ అవగాహన తదితర అంశాలపై విద్యార్థులకు చిన్నతనంలోనే అవగాహన పెంచేందుకు బాలోత్సవాలు దోహదపడతాయని తెలిపారు. ఈ భావజాల మార్పు సమాజ మార్పునకు, విద్యార్థుల్లో ప్రశ్నించే తత్వానికి, స్వయం శక్తితో ఎదిగేందుకు ఉపయోగపడుతుందన్నారు. ఆ బాధ్యతను తరగతి గదిలో విద్యాబోధన చేసే ఉపాధ్యాయులపై ఉందని తెలిపారు. విద్యాబోధనతో పాటు విద్యార్థుల్లో శాస్త్రీయ అవగాహన పెంచే కృషి ఉపాధ్యాయులు చేయాలని కోరారు. బాలోత్సవ నాయకులు బి.రామాంజనేయులు మాట్లాడుతూ... బాలల సంపూర్ణ వ్యక్తిత్వ వికాసానికి బాలోత్సవాలు తోడ్పడతాయని, ఆ విధమైన కృషికి సమాజంలోని మేధావులు, ఉపాధ్యాయులు కలిసి పని చేయడం ద్వారా బాలోత్సవాలను జయప్రదం చేయాలని కోరారు. విద్యార్థుల్లో ఉన్న మూఢవిశ్వాసాలను తొలగించేందుకు, అభ్యుదయ, శాస్త్రీయ భావజాలాన్ని నింపేందుకు బాలోత్సవాలు ఎంతగానో తోడ్పడతాయన్నారు. కర్నూలు బాలోత్సవ నాయకులు జె.రంగస్వామి, ఎంసివి.రమణా రెడ్డి ప్రసంగించారు. ఎమ్మిగనూరు బాలోత్సవ నాయకులు ఎ.రవికుమార్, ఎన్.నాగమణి, ఎస్.ప్రసాద్, వై.రామాంజనేయులు, భాగ్యరాజు పాల్గొని ఎమ్మిగనూరు బాలోత్సవాలను డిసెంబర్‌లో విజయవంతంగా నిర్వహిస్తామని తెలిపారు.


మాట్లాడుతున్న బాలోత్సవాల జిల్లా కార్యదర్శి ధనుంజయ

'సిసి రోడ్లు, డ్రెయినేజీ నిర్మించాలి'

ప్రజాశక్తి - ఆస్పరి


రోడ్లను పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

మండలంలోని ముత్తుకూరు గ్రామంలో సిసి రోడ్లు, డ్రెయినేజీ కాలువలను నిర్మించాలని సిపిఎం మండల కార్యదర్శి బాలకృష్ణ డిమాండ్ చేశారు. బుధవారం సిపిఎం బృందం మండలంలోని ముత్తుకూరు గ్రామంలోని రోడ్లను పరిశీలించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామంలో రోడ్లు చాలా అధ్వానంగా ఉన్నాయని, డ్రెయినేజీ కాలువల లేక మురుగునీరు రోడ్లపై పారుతున్నా పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. రోడ్లపై మురుగునీరు నిల్వ ఉండడం వల్ల దోమలు వృద్ధి చెంది ప్రజలు అనారోగ్యం బారిన పడే అవకాశం ఉందన్నారు. పంచాయతీ అధికారులు స్పందించి గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. లేకపోతే ప్రజలతో కలిసి సచివాలయం ముందు ఆందోళన చేస్తామని హెచ్చరించారు. సిపిఎం నాయకులు కృష్ణ, రామాంజనేయులు, పురుషోత్తం, రంగన్న పాల్గొన్నారు.

'జిల్లా సాధనకు కలిసి రావాలి'

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని జిల్లా సాధనకు నిర్వహించే ఉద్యమంలో ప్రజలు కలిసి రావాలని జిల్లా సాధన సమితి కన్వీనర్ నూర్ అహ్మద్ కోరారు. బుధవారం ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు నిరసన చేపట్టారు. అంతకుముందు కార్యాలయంలో ఎఒకు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ... మంత్రి వర్గ ఉప సంఘం పర్యటించకుండానే ఆదోని జిల్లా ఏర్పాటు ప్రతిపాదనను పక్కన పెట్టటం బాధాకరమన్నారు. వెనుకబడిన ఈ ప్రాంతాన్ని జిల్లాగా ఏర్పాటు చేసేందుకు మంత్రి వర్గ ఉపసంఘం ఆదోనిలో పర్యటించాలని కోరారు. ఆదోని జిల్లా సమితి మండల కన్వీనర్ నరేంద్ర యాదవ్, షకీల్, అయ్యాలి, డిఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు ఉదయ్, బాలు, గిరి ఉన్నారు.


మాట్లాడుతున్న నూర్ అహ్మద్

వరద కాలువ నిర్మించాలి : సిపిఎం

ప్రజాశక్తి - కౌతాళం : జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో కరువు, వలసలు నివారణకు తుంగభద్ర నదిపై వరద కాలువ నిర్మించాలని, లేకపోతే బ్రిడ్జి కం బ్యారేజ్ నిర్మించాలని సిపిఎం సీనియర్ నాయకులు మల్లయ్య, మండల కన్వీనర్ ఈరన్న డిమాండ్ చేశారు. నవంబర్ 1న కౌతాళంలో జరిగే సదస్సును జయప్రదం చేయాలని కోరుతూ బుధవారం మండలంలోని బంటకుంట, సులేకేరి, మదిరే, పొదలకుంట, హాల్వి, గోతులదొడ్డి, కుంభాలనూరు, నదీచాగి, కాత్రికి గ్రామాల్లో కరపత్రాలు పంచుతూ ప్రచారం చేశారు. నాయకులు బసవరాజు, నగేష్, వెంకన్న, మారెప్ప పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి ఇన్‌ఛార్జీ వైకుంఠం జ్యోతి

'స్థానిక'లో టిడిపి గెలుపునకు కృషి

- టిడిపి ఇన్‌ఛార్జీ వైకుంఠం జ్యోతి

ప్రజాశక్తి-ఆలూరు

వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆలూరు నియోజకవర్గంలో టిడిపి బలపరిచే జడ్‌పిటిసి, ఎంపిపి, ఎంపిటిసి, సర్పంచుల గెలుపునకు నియోజకవర్గ, మండల, గ్రామ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని టిడిపి ఆలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జీ వైకుంఠం జ్యోతి, ఎపి సీడ్స్ కార్పొరేషన్ ఛైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వైకుంఠం శివప్రసాద్ కోరారు. బుధవారం వైకుంఠం జ్యోతి అధ్యక్షతన ఆలూరు నియోజకవర్గ సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాదిన్నర అవుతున్నా నియోజకవర్గంలో టిడిపి నాయకులకు, కార్యకర్తలకు న్యాయం జరగక నిరుత్సాహంతో ఇబ్బందులకు గురయ్యారని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ వైకుంఠం కుటుంబంపై నమ్మకంతో ఇన్‌ఛార్జీ బాధ్యతలు ఇచ్చారని తెలిపారు. పార్టీ ఆదేశాలతో టిడిపి సభ్యత్వాన్ని జిల్లాలోనే అత్యధికంగా చేపట్టిన ఘనత వైకుంఠం కుటుంబానికి దక్కుతుందని చెప్పారు. అదేస్ఫూర్తితో వచ్చే స్థానిక ఎన్నికల్లో టిడిపి సత్తా చూపించాలని కోరారు. పది రోజుల్లో అన్ని మండలాల కమిటీలు, క్లస్టర్, బూత్ కమిటీలు ఏర్పాటు చేయబోతున్నట్లు తెలిపారు. మాజీ ఎంపిపి రామచంద్రనాయుడు, మార్కెట్ యార్డు ఛైర్మన్ బిల్లేకల్ వెంకటేశులు, ఎబిసి డిసి ప్రెసిడెంట్ నగరడోన కిష్టప్ప పాల్గొన్నారు.

టిడిపి సీనియర్ నాయకునికి పరామర్శ

ప్రజాశక్తి - ఆదోని


ఆర్థిక సాయం అందిస్తున్న భూపాల్ చౌదరి

అనారోగ్యంతో బాధపడుతున్న టిడిపి సీనియర్ నాయకుడు, పట్టణ మాజీ అధ్యక్షులు గుంటప్ప కుటుంబ సభ్యులకు పార్టీ అండగా ఉంటుందని టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి భూపాల్ చౌదరి, యువ నాయకులు మారుతి నాయుడు తెలిపారు. బుధవారం వాల్మీకి గుంటెప్ప నివాసానికి వెళ్లి ఆరోగ్య పరిస్థితి తెలుసుకొని పరామర్శించారు. మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు ఆదేశాల మేరకు ప్రభుత్వం ద్వారా మంజూరైన సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అనారోగ్యంతో ఇంటికి పరిమితమైన గుంటప్ప మెరుగైన చికిత్స కోసం సిఎం రిలీఫ్ ఫండ్ కింద రూ.2.60 లక్షల చెక్కును ఇచ్చామన్నారు. టిడిపి కోసం ఎన్నో ఏళ్లుగా శ్రమించారని తెలిపారు. పార్టీకి, తమ కుటుంబానికి చేసిన సేవలు తాము ఎప్పటికీ మరువలేమని చెప్పారు. గుంటెప్ప ఆరోగ్యంపై నిరంతరం సమాచారం తెలుసుకుంటూ, అవసరమైతే అదనపు వైద్య ఖర్చులకు మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు సిఎం రిలీఫ్ ఫండ్ ద్వారా సహాయం అందించేలా కృషి చేస్తారని భరోసా ఇచ్చారు. తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్ చౌదరి, 1వ వార్డు కౌన్సిలర్ పార్వతి భర్త వాల్మీకి వెంకటేష్, జయరాం, కాసన్న గోపాల్ ఉన్నారు.

ఎస్సీ కుటుంబంపై కెనరా బ్యాంకు యాజమాన్యం దౌర్జన్యం

- బాధితుడు ఈరన్న

ప్రజాశక్తి - నందవరం

తమపై కెనరా బ్యాంకు యాజమాన్యం దౌర్జన్యానికి పాల్పడిందని దళిత కుటుంబ సభ్యులు అంజనమ్మ, ఈరన్న వాపోయారు. బుధవారం ఈరన్న కెనరా బ్యాంకు ముందు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కెనరా బ్యాంకు యాజమాన్యం తమ కుటుంబాన్ని అవమానపరిచిందని, మంగళవారం సాయంత్రం దౌర్జన్యంగా తమ ట్రాక్టర్‌ను తీసుకెళ్లారని తెలిపారు. తమ తల్లి అంజనమ్మ పేరు మీద ట్రాక్టర్‌పై రుణం తీసుకున్నట్లు చెప్పారు. రుణం కట్టకపోవడంతో ఇష్టానుసారంగా వ్యవహరించి వీధిలో తమ కుటుంబాన్ని అభాసుపాలు చేశారని ఆవేదన చెందారు. రెండు నెలలు గడువు కోరామని, ఒక్కరోజు కూడా సమయాన్ని ఇవ్వబోమని తెగేసి చెప్పారని వాపోయారు. తన తల్లిని తమ కళ్లం దగ్గరకు బలవంతంగా తీసుకెళ్లి బెదిరించి ఫొటోలు దిగి ఇంటికి పంపించారని తెలిపారు. వృద్ధురాలు అని కూడా చూడకుండా ట్రాక్టర్ ఉన్న ప్రదేశానికి తీసుకెళ్లారన్నారు. అనంతరం కళ్లం తాళాలు పగులగొట్టి బ్యాంకు సిబ్బంది ట్రాక్టర్ తీసుకెళ్లారని చెప్పారు. వారి దౌర్జన్యానికి పోలీసులు కూడా వత్తాసు పలకడం బాధాకరమన్నారు. తమ కుటుంబ మర్యాదను రోడ్డుకీడ్చిన అధికారులపై జిల్లా అధికారులు చర్యలు తీసుకొని తమ ట్రాక్టర్ ఇప్పించాలని కోరారు. పత్తి అమ్మిన తర్వాత రుణం చెల్లిస్తానని చెప్పినా వినకుండా కక్షపూరితంగా వ్యవహరించిన అధికారులను శిక్షించాలని తెలిపారు. తన న్యాయం చేయకపోతే రైతు సంఘం నాయకులతో కలిసి ధర్నా నిర్వహిస్తానన్నారు.


మాట్లాడుతున్న బాధితుడు ఈరన్న

నాకు సంబంధం లేదు


- కెనరా బ్యాంకు మేనేజర్ నాగరాజ్

బ్యాంకు మేనేజర్‌ను వివరణ కోరగా... ఉన్నతాధికారులు వచ్చి ట్రాక్టర్ తీసుకెళ్లారు. నాకు సంబంధం లేదు. ట్రాక్టర్ తీసుకెళ్లడానికి మీరు కూడా వచ్చారు కదా అని అడగగా దానికి ఆయన సమాధానం చెప్పలేదు.

పప్పు శనగ రైతులను ఆదుకోవాలి : రైతు సంఘం

ప్రజాశక్తి - ఆస్పరి

గత మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రైతుసంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు మధు రెడ్డి, రంగస్వామి డిమాండ్ చేశారు. బుధవారం రైతులు సాగుచేసిన పప్పు శనగ పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఆస్పరితో పాటు జొహరాపురం, చిన్నహోతూరు చిరుమాన్ దొడ్డి, శంకరబండ, చిగిలి, బిణిగేరి, నగరూరు గ్రామాల్లో పప్పు శనగ పంటను రైతులు అధికంగా సాగు చేస్తారన్నారు. మొంథా తుపాను ప్రభావం వల్ల శనగ పంటల్లో వర్షపు నీరు చేరి, పంట కొట్టుకుపోయి పూర్తిగా దెబ్బ తినిందని తెలిపారు. ప్రభుత్వం స్పందించి ఎకరాకు రూ.50 వేల నష్టపరిహారం ప్రకటించి రైతులను ఆదుకోవాలని కోరారు. ఆస్పరి మండలాన్ని కరువుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. రైతు సంఘం మండల నాయకులు వెంకట రాముడు, రామాంజనేయులు, రవి, నాగరాజు, శ్రీనివాసులు పాల్గొన్నారు.



పప్పు శనగ పంటను పరిశీలిస్తున్న నాయకులు

'పిపిపి'ని రద్దు చేయకుంటే పోరాటం : వైసిపి

ప్రజాశక్తి - కౌతాళం

కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన పిపిపి విధానాన్ని రద్దు చేయకుంటే పోరాటాలకు సిద్ధమవుతామని వైసిపి నాయకులు హెచ్చరించారు. బుధవారం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి, యువనేతలు వై.ప్రదీప్ రెడ్డి, వైసిపి సీనియర్ నాయకులు బిఆర్.వీరభద్ర గౌడ్, మాజీ సర్పంచి బిఆర్.చంద్రహాస గౌడ్, సర్పంచి ప్రసన్న గౌడ్ ఆదేశాల మేరకు మండలంలోని బదినేహాల్ గ్రామంలో వైసిపి నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో రచ్చబండ కార్యక్రమం చేపట్టారు. ప్రతి ఒక్కరినీ కలిసి కూటమి ప్రభుత్వం తీసుకున్న మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణతో నష్టపోతున్న విధానాన్ని ప్రజలకు వివరిస్తూ కోటి సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడారు. ప్రజల ఆస్తులు కాపాడాల్సిన ప్రభుత్వమే ప్రయివేట్ వ్యక్తులకు వత్తాసు పలికితే ఎలా అని ప్రశ్నించారు. ఈ కూటమి ప్రభుత్వానికి పాలించే అర్హత లేదన్నారు.



సంతకాల సేకరణ చేపడుతున్న నాయకులు



ఎస్ఐతో ఉన్న నాయకులు

ఎస్ఐని కలిసిన జనసేన నాయకులు

ప్రజాశక్తి - నందవరం

నందవరం ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన తిమ్మారెడ్డిని జనసేన మండల అధ్యక్షులు పెద్ద ఎల్లప్ప బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఎస్ఐకి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. మండల ప్రజలకు ఉన్నతమైన సేవలు అందించాలని కోరారు. చంద్ర, అంజి, ఇర్ఫాన్, నరసింహులు, షేక్ బాషా, రామలింగడు, ఇసాక్, పూలచింత జనసేన కార్యకర్తలు ఉపేంద్ర, వీరేష్, శంకర్ పాల్గొన్నారు.

నిబంధనలు కాలరాస్తున్న ఎంఇఒ

- డిఇఒ ఆదేశాలు లేకుండా ఎంఆర్‌సికి మకాం మార్చిన హెచ్ఎం
- విద్యార్థి సంఘాలు

ప్రజాశక్తి - హాలహర్వి

మండలంలో ప్రభుత్వ నిబంధనలను ఎంఇఒ ఈరన్న కాలరాస్తున్నారని, ఎంఇఒ ఈరన్నను, ప్రధానోపాధ్యాయులు రామకృష్ణారెడ్డిని విచారణ జరిపి సస్పెండ్ చేయాలని ఆర్‌పిఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఆఫ్రిది, ఆర్‌యుఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రఘునాథ్ డిమాండ్ చేశారు. బుధవారం వారు మాట్లాడారు. విద్యాశాఖ అధికారుల ఆదేశాలు లేకుండా, ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఎంఇఒ వ్యవహరిస్తున్నారని తెలిపారు. ఎంఇఒ వారి కార్యాలయంలో కార్యాలయ పనులకు (జీతాలు చేయడం, సర్వీస్ రిజిస్టర్ల నిర్వహణ) ఉపాధ్యాయులను వారి వద్దనే ఉంచుకున్నారని చెప్పారు. అలాంటి పనులకు ఉపాధ్యాయులను వినియోగించుకోకూడదని ఉత్తర్వులు ఉన్నాయని తెలిపారు. ఎంఇఒ ఈరన్న ఉత్తర్వులను లెక్క చేయకుండా హాలహర్వి ఎంపిపిఎస్ ప్రధానోపాధ్యాయులు రామకృష్ణారెడ్డిని నియమించుకొని ఆయన పాఠశాలలో హాజరు వేసిన తర్వాత కార్యాలయ పనులకు వినియోగించుకుంటున్నారని చెప్పారు. ఆయన పాఠశాలలకు డుమ్మా కొడుతున్నారని తెలిపారు. ఉపాధ్యాయుని, ఎంఇఒను విచారించి విధుల నుంచి తొలగించాలని కోరారు.



మాట్లాడుతున్న విద్యార్థి సంఘాల నాయకులు

బయోమెట్రిక్ సకాలంలో వేయాలి : ఎంపిడిఒ

ప్రజాశక్తి - చిప్పగిరి

ప్రభుత్వ ఆదేశాల మేరకు సచివాలయ అధికారులు బయోమెట్రిక్ హాజరును ఉదయం 10.30 గంటల్లోపు పూర్తి చేయాలని ఎంపిడిఒ అల్లా బకాష్ తెలిపారు. బుధవారం మండల కార్యాలయంలో డిప్యూటీ ఎంపిడిఒ నాగరాజు ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సచివాలయ కార్యాలయాలకు అధికారులు సకాలంలో చేరుకుని బయోమెట్రిక్ హాజరు తప్పనిసరిగా వేయాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు సచివాలయ అధికారులతో సమన్వయం చేసుకొని గ్రామ సర్వేలో చురుకుగా పాల్గొని పూర్తి చేయాలన్నారు. కాజీపురం, చిప్పగిరి ఎస్ఎస్ ట్యాంకుల నుంచి సరఫరా అయ్యే తాగునీరు ఎక్కడైనా లీకేజీ ఉంటే ఇంజినీరింగ్ అసిస్టెంట్లు చూసుకొని ఉన్నతాధికారులకు తెలిపి సమస్యను పరిష్కరించాలన్నారు. గ్రామ వీధుల్లో నీరు నిలువకుండా చూసి బ్లీచింగ్ పౌడర్‌ను వేయించాలని తెలిపారు. మండలంలో నిర్మాణంలో ఉన్న 420 గృహాలను 2026 మార్చి 31 నాటికి పూర్తి చేసేలా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలన్నారు. నిర్మాణాలు చేపట్టకపోతే లబ్ధిదారులతో రాతపూర్వకంగా తీసుకోవాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శులు జయరాం నాయక్, నరేంద్ర, సుధీర్, సురేంద్ర, ప్రమీల, హరిబాబు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ అల్లాబకాష్



ధ్రువీకరణ పత్రం అందిస్తున్న డిప్యూటీ ఎంపిడిఒ గోపాల్

మార్కెట్‌కు వేలం

- పెరిగిన పంచాయతీ ఆదాయం

ప్రజాశక్తి - దేవనకొండ

మండలంలోని కుంకునూరు పంచాయతీ కూరగాయల మార్కెట్ వేలం బుధవారం డిప్యూటీ ఎంపిడిఒ గోపాల్ ఆధ్వర్యంలో నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి, సర్పంచి సమక్షంలో వేలం నిర్వహించగా గ్రామానికి చెందిన రమేష్ రూ.14.70 లక్షలకు వేలంపాట దక్కించుకున్నారు. గతేడాది కూరగాయల మార్కెట్ రూ.8 లక్షలకు పోగా ఈ ఏడాది అదనంగా రూ.6.70 లక్షలు పెరిగింది. పంచాయతీకి ఆదాయం పెరిగిందని పంచాయతీ కార్యదర్శి శివ శంకర్ సింగ్ తెలిపారు.

జూనియర్స్‌కు స్వాగతం పలికిన సీనియర్స్

:



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ జ్ఞానేశ్వర్


ప్రజాశక్తి-ఆలూరు

ఆలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరంలో డిగ్రీలో చేరిన జూనియర్స్‌కు సీనియర్స్ బుధవారం స్వాగతం పలికారు. విద్యార్థులంతా ఆటపాటలతో అలరించి ఒకరినొకరు పరిచయం చేసుకున్నారు. ప్రిన్సిపల్ జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ... విద్యార్థులు సక్రమంగా కళాశాలకు హాజరై భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని సూచించారు. చెడు అలవాట్లకు, వ్యసనాలకు, ర్యాగింగ్‌కు దూరంగా ఉంటూ అధ్యాపకులను గౌరవించాలని, తోటి విద్యార్థులతో స్నేహపూర్వకంగా ఉండాలని తెలిపారు. అధ్యాపకులు మాధవి, సుశీల, లక్ష్మి నరసమ్మ, రాఘవేంద్ర, భాస్కర్, గోపాల్ పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రిని 30 పడకలకు అప్ గ్రేడ్ చేయండి : టిడిపి

ప్రజాశక్తి - హోళగుంద

హోళగుంద ప్రభుత్వాస్పత్రిని 30 పడకలకు అప్‌గ్రేడ్ చేయాలని టిడిపి నాయకులు కోరారు. బుధవారం టిడిపి ఇన్‌ఛార్జ్ వైకుంఠం జ్యోతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గోవిందు గౌడ్, అబ్దుల్ సుభాన్, ముద్దన గౌడ్, మొయిన్, వలీ బాషా, జాకీర్, బి.అబ్దుల్ రెహమాన్, హుస్సేన్ పీరా, ఈబదుల్లా, సుభాన్, తాహెర్, ఇలియాస్ మాట్లాడారు. హోళగుంద ప్రభుత్వాస్పత్రి పరిధిలో దాదాపు 40 వేల జనాభాకు వైద్య సేవలు అందుతున్నాయని తెలిపారు. ప్రభుత్వాస్పత్రిని 30 పడకలకు అప్ గ్రేడ్ చేయాలని కోరారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు